క్లుప్తంగా

సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్

నందిగామ: సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు రాజీ పడేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమన్నారు. అవసరమైన వారు సంప్రదించవచ్చన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు తేదీ మార్పు

నందిగామ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి మరికొన్ని రోజులు గడువు పెంచినట్లు సెంటర్ కోఆర్డినేటర్ ఏలూరి పిచ్చేశ్వరరావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్ బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందటానికి ఆఖరు తేదీని సెప్టెంబర్ 5 వరకు పొడిగించారు. రెగ్యులర్ ఇంటర్మీడియెట్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 73829 29685 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభ

జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి, రామచంద్రునిపేట, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ డీఆర్పీలు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం 2022–23లో జరిగిన పనులను గ్రామ సభలో చర్చించారు. కార్యక్రమంలో డీఆర్పీలు ప్రసాద్, సాగర్, చంద్రరావు, సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెదమోదుగపల్లి సర్పంచ్‌గా విజయలక్ష్మి ఎన్నిక



పెదమోదుగపల్లి(వత్సవాయి): గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి కల్యాణం విజయలక్ష్మి విజయం సాధించారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నిక జరిగింది. మొత్తం గ్రామంలో 865 ఓట్లు ఉండగా వాటిలో 798 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి విజయలక్ష్మికి 417 ఓట్లు రాగా టీడీపీ బలపర్చిన అభ్యర్థికి 379 ఓట్లు వచ్చాయి. నోటాకు రెండు ఓట్లు పడ్డాయి. 38 ఓట్లతో విజయలక్ష్మి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి డి.బాబూరావు ప్రకటించి ఆమేరకు నియామకపత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఫోన్ ద్వారా విజయలక్ష్మికి అభినందనలు తెలియజేశారు. నియామక పత్రం అందుకున్న అనంతరం విజయలక్ష్మి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కచ్చితమైన ఓటరు జాబితా తయారు

కంచికచర్ల: మండలంలో గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీనాయకులు సహకరించాలని తహసీల్దార్ పి.శంకరబాబు విజ్ఞప్తిచేశారు. మండలంలోని కంచికచర్ల, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, గండేపల్లి, కీసర గ్రామాల్లో శనివారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు చేపట్టారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిక్కచ్చిగా చేపడుతున్నాయని అన్నారు. గ్రామాల్లోని 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి వారికి ఓటు హక్కు పొందేలా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని రాయకీయ పార్టీల నాయకుల సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు లిస్టును తయారు చేస్తామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం

జయంతి(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయటంతో పాటు వారిని ప్రోత్సాహక బహుమతులు అందించటం అభినందనీయ మని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో గతేడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యా ర్థులకు గ్రామానికి చెందిన కొణతం రామచంద్రరావు, జానకిరామయ్య, దుర్గమ్మల జ్ఞాపకార్థం వారి మనవడు జశ్వంత్ సౌజన్యంతో అందించిన నగదు బహుమతులను శనివారం ఆమె విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.9వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఉప సర్పంచ్ ఇప్పల సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆత్మాభిమానానికి పట్టం కట్టిన ప్రజలు

- గెలిచిన అభ్యర్థులతో ర్యాలీ చేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు



ఉప ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులతో విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్సీ అరుణకుమార్

దాచవరం(వీరులపాడు): అహంకారానికి, ఆత్మాభిమానానికి మధ్య జరిగిన ఉప ఎన్నికలో ప్రజలు ఆత్మాభిమానం వైపు నిలిచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్‌గా గెలిచిన గద్దె వెంకటేశ్వర్లు, జమ్మవరం గ్రామంలో వార్డు సభ్యురాలిగా ఎన్నికైన కటాక్షంతో కలిసి శనివారం రాత్రి దాచవరం గ్రామంలో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ మంచి చేస్తున్నది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి అభ్యర్థులను గెలిపించాయన్నారు. మంచి చేసే వారికి ప్రజలు ఎల్లవేళలా అండగా ఉంటారు తప్ప కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోరని మరోసారి నిరూపించారని చెప్పారు.

సంప్రదాయానికి టీడీపీ తూట్లు..

మృతి చెందిన వారి స్థానంలో జరుగుతున్న ఉప ఎన్నికలలో వారి కుటుంబ సభ్యులు పోటీ చేస్తుంటే ప్రతిపక్షాలు పోటీ చేయకుండా బాధిత కుటుంబానికి అండగా నిలిచే సంప్రదాయానికి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తూట్లు పొడిచారని ఎమ్మెల్సీ అరుణకుమార్ అన్నారు. అహంకార పూరితంగా వ్యవహరించి పోటీకి దిగిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయం తథ్యమని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే మంచి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా పక్షపాత ధోరణి చూపకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ రాష్ట్రం అండగా ఉంటుందని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి మద్దతు : ఎమ్మెల్యే

నందిగామటౌన్: వీరులపాడు మండలంలోని దాచవరం సర్పంచ్, జమ్మవరం గ్రామంలోని వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలిచారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు మద్దతు పలికారన్నారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులకు అండగా నిలిచి ఓట్లు వేసి గెలిపించిన రెండు గ్రామాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఉప ఎన్నిక

29 ఓట్ల మెజారిటీతో దాచవరం సర్పంచ్‌గా గద్దె వెంకటేశ్వర్లు విజయం



దాచవరం సర్పంచ్‌గా నియామక పత్రం అందుకుంటున్న గద్దె వెంకటేశ్వర్లు



దాచవరంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

వీరులపాడు: మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపరిచిన గద్దె వెంకటేశ్వర్లు 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ఝాన్సీరాణి తెలిపారు. గ్రామంలో మొత్తం 696 ఓట్లకు గాను 637 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గద్దె వెంకటేశ్వర్లుకు 329 ఓట్లు రాగా టీడీపీ బలపర్చిన తోట రవిబాబుకు 300 ఓట్లు, జనసేన బలపరిచిన కామిశెట్టి వెంకటేశ్వర్లుకు రెండు ఓట్లు రాగా ఆరు చెల్లని ఓట్లు నమోదయ్యాయి. జమ్మవరం ఎనిమిదవ వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఇడుపులపాటి కటాక్షం 19 ఓట్లతో విజయం సాధించారు. వార్డులో 143 ఓట్లు ఉండగా 119 ఓట్లు పోలయ్యాయని కటాక్షంకు 69 ఓట్లు రాగా, టీడీపీ బలపర్చిన అభ్యర్థి మంగళపూడి కుమారికి 50 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి వాణి తెలిపారు. అనంతరం విజయం సాధించిన గద్దె వెంకటేశ్వర్లు, ఇడుపులపాటి కటాక్షంలకు ఎన్నికల అధికారులు నియామక పత్రాలు అందజేశారు.

గ్రామంలో సందడి వాతావరణం..

ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు విజయం సాధించటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. యువత బైక్ ర్యాలీలతో కేరింతలు కొట్టటంతో పాటు టపాసులు కాల్చి విజయోత్సవం జరిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ఉప సర్పంచ్ రామిశెట్టి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు తోట హరీష్, వేమా సురేష్‌బాబు, అయిలూరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



గడపగడపలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక 7 వ సచివాలయం పరిధిలోని 15,18 వ వార్డుల్లో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వార్డుల్లోని నీళ్ల ట్యాంకు బజారు, ముదిరాజ్ బజారు, రెడెంకమ్మ ఆలయం వీధి, సాయంత్రం రేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఉదయభాను పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నింటిని అమలు చేయడంతో పాటు అదనంగా మరికొన్ని పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. పాలనలో అనేక నూతన సంస్కరణలు చేపట్టి దేశం యావత్తు ఏపీ వైపు చూసేలా చేశారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజల్లో మంచి మార్కులు పడుతుండటంతో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానికంగా రేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న పశువుల బందెల దొడ్డిని వాడుకలోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటో శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ గోలి రామేశ్వరి, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ ఎండీ జాన్‌బాషా, మాజీ కోఆప్షన్ సభ్యుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, సచివాలయ కన్వీనర్ సంగిశెట్టి శ్రీరంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మునిని శివ, గోలి వెంకటేశ్వరరావు, మడ్డి నాగరాజు, ఈర్ల రామకృష్ణ, లేదండ్ల వెంకటేశ్వర్లు, కొండ అయ్యప్ప పాల్గొన్నారు.

రూ. లక్ష విలువైన గ్రంథాలు అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి శనివారం తన కార్యాలయంలో పిల్లలమర్రి పినవీరభద్ర కళాపీఠానికి చెందిన గ్రంథాలయాలకు రూ. లక్ష విలువైన గ్రంథాలను అందజేశారు. వాటిని కళాపీఠానికి చెందిన తెలంగాణ ప్రతినిధి శీల అవిలేనుకు కొల్లూరి సతీమణి కనకవల్లి వితరణగా ఇచ్చారు. కనకల్లి మాట్లాడుతూ విలువైన గ్రంథాలు అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గ్రంథాలయానికి ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. శీల అవిలేను మాట్లాడుతూ మంచి పుస్తకాలను అందించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్, ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయరాజు, ప్రచార కార్యదర్శి డాక్టర్ బి.వసంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కె.రాము, వైస్ ప్రెసిడెంట్ గుర్రం ఏడుకొండలు, సుబ్బయ్య తతదితరులు పాల్గొన్నారు.



కళాపీఠం ప్రతినిధికి గ్రంథాలు అందజేస్తున్న కనకవల్లి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక 7 వ నంబరు సచివాలయం పరిధిలో శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉదయభాను సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని ఆహార పదార్థాలను, పారిశుద్ధ్యం, పిల్లల హాజరు పట్టిక తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. పేదరికంతో గర్భిణులు సరైన పోషక ఆహారాన్ని తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారని, వారికి పుట్టిన బిడ్డలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పోషకాహారాన్ని అందించాలని నిర్ణయించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన ఉప్పెల్లి రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని కుమారుడు ఉప్పెల్లి సాయి మిక్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సాయి ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఉదయభాను రూ.50 వేలు విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పట్టణంలో దశాబ్దాలుగా ఫొటోగ్రఫీ వృత్తిలో రాణిస్తున్న సీనియర్ ఫొటోగ్రాఫర్లు అల్లి చంద్రశేఖర్, గార్లపాటి వాసుదేవమూర్తి, రెబ్బ శ్రీనివాసరావులను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు అల్లి సత్యనారాయణ, కిషోర్, వీరబ్రహ్మం, ప్రభాకర్, నాని, గోపి, లక్ష్మీనారాయణ, ప్రసాద్, వెంకీ, శేషు, నాగేంద్ర, మహేష్, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జాతీయ విద్యా విధానం పేరుతో మొత్తం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాల బహిరంగ సభ శనివారం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు టి.ప్రవీణ్, ఎం.రమణ పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాంప్లెక్స్‌లోని సొసైటీ కార్యాలయంలో నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని వివరించారు.

700 మందికి శ్రీవారి అన్నప్రసాదం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోట లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో శనివారం 700 మంది శ్రీవారి అన్నప్రసాదం స్వీకరించారు. దాత శ్రీకాకుళపు శ్రీనివాసరావు, వీరరాఘవమ్మ సహకారంతో స్వామి వారికి మహానివేదన సమర్పించి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామికి శనివారంతో కూడిన శ్రావణమాసం కావడంతో శ్రీ వారికి ప్రత్యేక పూజలు సహస్ర నామార్చాన చేశారు.

లబ్బీపేట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..

కంచికామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత స్నానం, నవగ్రహ అర్చన, నమక, చమక సహిత పూజలు నిర్వహించారు.

భక్తుల సహకారంతోనే ఆలయాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు

పెనుగంచిప్రోలు: ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని తిరుపతమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. గ్రామంలోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పాలక మండలి కార్యాలయంలో శనివారం చైర్మన్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను కూడా గుర్తించి యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించే దాతలను అన్ని విధాలుగా గౌరవించటంతో పాటు సముచిత గుర్తింపునిస్తామని తెలిపారు. ఇటీవల రూ.70 లక్షలతో హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ నరేష్ విశ్రాంతి భవన నిర్మాణానికి ముందుకు రావటం అభినందనీయమని అన్నారు. దాతను ప్రోత్సహించేందుకు ఆయన తండ్రి పేరు భవనానికి పెట్టేందుకు ఆమోదించామని చెప్పారు. వాహన పూజ టికెట్ ధరలను కూడా పెంచేందుకు తీర్మానం చేసి ఆమోదించామని తెలిపారు. ఆలయ రాజగోపురానికి ప్రత్యేక లైటింగ్ ఏర్పాటుకు, ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు పర్యవేక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మాణం, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని గ్రామ దేవతామూర్తులకు చీర సారె సమర్పించేందుకు తీర్మానాలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఆర్‌జేసీ రమేష్ నాయుడు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

- రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని మునగచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధుల నుంచి రూ.8 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించటంతో పాటు గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల రంగ, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, వెంకటేశ్వరరావు, వీరభద్రయ్య, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

- పోతురాజు, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ట
- పూజలు చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ప్రతిష్టా మహోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు గ్రామంలో శనివారం ముత్యాలమ్మ అమ్మవారు, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తుల నడుమ అర్చకులు, వేద పండితులు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవానికి విచ్చేసిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ములకలపల్లి కృష్ణమోహన్, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపీ గ్రంథాలయాల పితామహుడు పాతూరి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సంఘ సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయాల అభివృద్ధే తన ఊపిరిగా జీవించి ఏపీలో గ్రంథాలయోద్యమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లిన ఘన పాతూరి నాగభూషణంకు దక్కుతుందని న్యూఢిల్లీకి చెందిన సెంటర్‌ఫర్ మీడియా స్టడీస్ నిర్వాహకులు డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు అన్నారు. పాతూరి ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం నగరంలోని సర్వోత్తమ భవనంలో పాతూరి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఏపీ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు కేసీ కల్కూరా మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేసిన పాతూరి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాతూరి పురస్కారం విశ్రాంత ఆచార్యులు, ప్రకృతి ఆరోగ్య శాస్త్ర గ్రంథాలయ స్థాపకులు డాక్టర్ గజ్జల రామేశ్వరానికి అందించారు. అనంతరం పలు పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో రచయిత్రి చంద్రలత, గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద, సర్వోత్తమ గ్రంథాలయ అధ్యక్షులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, వెలిదండ్ల హనుమంత రామయ్య, గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు, రామ్మోహన గ్రంథాలయ కార్యదర్శి వి. కేశవరావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.